క్లుప్తంగా

రుష్యశృంగుడికి జలాభిషేకం


స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో వర్షం కోసం రుష్యశృంగుడికి ఆదివారం జలాభిషేకం చేశారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపెద్దలు, రైతులు, మహిళలు గ్రామ సమీపంలోని పీర్ల బావి వద్ద నుంచి బిందెలతో నీళ్లు తీసుకొచ్చి రుష్యశృంగుడికి 1001 బిందెలతో జలాభిషేకం చేశారు. పూర్వం గ్రామంలో వర్షాలు కురవని సమయంలో పెద్దలు ఈ ఆచారాన్ని నిర్వహించేవారని గ్రామ పెద్దలు తెలిపారు. అదే ఆచారాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. వర్షాలు సరిగ్గా కురవక బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయానికి వెండి బకెట్ అందజేత


వెండి బకెట్‌ను అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి రాజంపేట వాస్తవ్యుడు ఎస్.భార్గవ్ మనోహర్ రూ.52 వేలు విలువ చేసే 580 గ్రాముల వెండి బకెట్‌ను కానుకగా సమర్పించాడు. ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లు వారి ప్రవర్తనలో మార్పు తెచ్చుకున్నట్లు పోలీసులు భావిస్తే వారిపై షీట్లు ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేశ్వరరెడ్డి


మహేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఫైర్‌మన్లు

డోన్: గుంటూరులో ఆగస్టు 31వ తేదీ జరిగిన రాష్ట్ర ఫైర్ సర్వీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికల్లో డోన్ ఫైర్‌స్టేషన్ ఉద్యోగి మహేశ్వరరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం డోన్ ఫైర్ స్టేషన్ ఆవరణలో ఫైర్‌మన్లు, అగ్నిమాపక కేంద్ర అధికారి రంగస్వామిగౌడ్, న్యాయవాది ఆలా మోహన్‌రెడ్డి తదితరులు మహేశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించారు.

వంద శాతం పింఛన్ల పంపిణీ


పింఛన్ పంపిణీ చేస్తున్న కమిషనర్ జయరాం

డోన్: డోన్ మున్సిపల్ పరిధిలో పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేసినట్లు కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారని చెప్పారు. శనివారం సాయంత్రానికే 97.59 శాతం పంపిణీ చేయగా ఆదివారం వంద శాతం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. తారకరామనగర్‌లో పింఛన్ల పంపిణీని కమిషనర్ జయరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా పరిశీలించారు.

సీఐకు సన్మానం


సీఐను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

బనగానపల్లె: పట్టణ సీఐ కృష్ణయ్యను అఖిలభారత యాదవ మహాసభ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో యాదవ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య, మండల అధ్యక్షుడు గనమద్దిలేటి, శంకర్, వెంకటస్వామి, బాలవెంకటేశ్వర్లు, నాగేషుడు, బాలరాజు, గణేష్, బాలవీరభద్రుడు పాల్గొన్నారు.


కోవెలకుంట్ల సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది,


లింగాల సమీపంలో పాలేరు వాగు వంతెనపై ప్రవహిస్తున్న వరదనీరు

ఉప్పొంగిన వాగులు

- ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది
- నీట మునిగిన పంటలు
- స్తంభించిన రాకపోకలు


వల్లంపాడులో ఉప్పొంగి ప్రవహిస్తున్న కప్పలవాగు,


చిన్నకొప్పెర్ల వద్ద నల్లవాగు ఉధృతి

కోవెలకుంట్ల: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతోపాటు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి భారీగా నీటిని విడుదల చేయడంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కుందూనదికి అనుసంధానంగా ఉన్న వాగుల్లోకి వరదనీరు పోటెత్తింది. మండలంలోని వల్లంపాడు, చిన్నకొప్పెర్ల, లింగాల, పెద్దకొప్పెర్ల గ్రామాల సమీపాల్లోని కప్పల, నల్ల, పాలేరు, ఇరుకుమాను వాగుల వంతెనలపై వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో కోవెలకుంట్ల- లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం నుంచి రాకపోకలు స్తంభించాయి. ఆయా వాగుల పరివాహక ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న, తదితర పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది. లింగాల గ్రామానికి రెండువైపులా నీరు చేరి జలదిగ్బంధంలో చిక్కుకుంది. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, వల్లంపాడు, కలుగొట్ల గ్రామాల సమీపాల్లో ప్రవహిస్తున్న కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. కుందూనది, వాగుల పరివాహక ప్రాంతాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రజలకు సూచించారు.

కుందూ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి కుందూనదికి భారీగా నీటిని విడుదల చేయడంతో నదితీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని గుళ్లదూర్తి, వల్లంపాడు, కలుగొట్ల, తదితర గ్రామాల సమీపంలో ప్రవహిస్తున్న కుందూనది, పాలేరు, కప్పల, నల్లవాగుల ఉధృతిని పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా వాగులకు మరింత వరద పోటెత్తే అస్కారం ఉందని, ఆయా గ్రామాల ప్రజలు నది, వాగుల పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. ఆయా గ్రామాలకు వీఆర్‌ఓలకు బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు.


పాలేరువాగు ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్

నిమజ్జనానికి నీళ్లు లేవు


కోనేరులో నీరు లేక పెరిగిన పిచ్చి మొక్కలు

కొలిమిగుండ్ల: వినాయక చవితి పండుగ సమీపిస్తుండడంతో వాడవాడలా గణనాథులను కొలువుదీర్చేందుకు నిర్వాహకులు ఉత్సాహం చూపుతున్నారు. అయితే మండలంలో వర్షాభావ పరిస్థితులతో వినాయకులను నిమజ్జనం చేసేందుకు నీటి సమస్య ఏర్పడింది. చెరువులు, కుంటలు, కోనేర్లలో నీరు లేక వెలవెల బోతున్నాయి. ప్రధానంగా కొలిమిగుండ్లలో ఏటా 20 వరకు వినాయకుడి విగ్రహాలను కొలువుదీర్చుతారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం స్థానిక కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముందున్న కోనేర్లలో నిమజ్జనం చేస్తుండేవారు. ఈ ఏడాది ఆశించిన వర్షాలు కురవకపోవడంతో కోనేర్లలో నీరు లేక పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. నిమజ్జన సమయానికి వరుణుడు కరుణించకపోతే 13 కి.మీ దూరంలో ఉన్న అవుకు రిజర్వాయర్‌కు వెళ్లి నిమజ్జనం చేయాల్సి వస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పండుగ సమయానికి వానదేవుడు కరుణిస్తాడని ఆశతో ఎదురుచూస్తున్నారు.

రౌడీషీటర్లలో మార్పు రాకుంటే పట్టణ బహిష్కరణ

- సీఐ ఇంతియాజ్‌బాషా హెచ్చరిక


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

డోన్ టౌన్: రౌడీషీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని.. తీరు మార్చుకోకుంటే పట్టణ బహిష్కరణ విధిస్తామని సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దౌర్జన్యాలు, గొడవలు, చోరీలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. అందరిపై నిఘా ఉంటుందని.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పట్టణం విడిచి ఎక్కడికి వెళ్లినా ముందుగా సమాచారం ఇవ్వాలని, చేసిన తప్పులు మళ్లీ చేస్తే పీడీ యాక్ట్ ఉపయోగిస్తామన్నారు. ప్రతి వారం పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. గంజాయి, మట్కా, నాటుసారా, పేకాట, అక్రమ మద్యం తదితర వాటికి దూరంగా ఉండాలని హితవుపలికారు. ఎవరైనా ఇలాంటి వాటికి పాల్పడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఈవ్ టీజింగ్ ప్రాంతాల గుర్తింపు

పట్టణంలో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే ప్రధాన కూడళ్లను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

కనుల పండువగా ఉమామహేశ్వరుని కల్యాణం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరుని కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన ఉమా మహేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శివపార్వతుల ఉత్సవమూర్తులను వధూవరులుగా ముస్తాబు చేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నైతికత స్వేచ్ఛ ఉద్యమం పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముస్లిం మహిళలు

బనగానపల్లె రూరల్: స్థానిక జమాత్ ఏ ఇస్లామ్ హింద్ కార్యాలయంలో ఆ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో నైతిక స్వేచ్ఛ ఉద్యమం పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం అధ్యక్షురాలు మోహతరన్ అఖ్తరున్నిసా మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నైతికత స్వేచ్ఛ ఉద్యమం పేరుతో జాగృతి ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సామాజిక అసమానతలు, లైంగిక హింస, అత్యాచారాలు, హత్యలు ఎక్కువ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నైతికత ద్వారా నిజమైన స్వేచ్ఛ ఎలా పొందవచ్చో ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు.

డోన్ అభివృద్ధిపై వైఎస్సార్ ముద్ర

- ఆయన హయాంలో నీటి ప్రాజెక్టులతో పాటు అనేక అభివృద్ధి పనులు
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి


నవధాన్యాలతో వేసిన వైఎస్సార్ చిత్రం

డోన్: కొందరు మరణించినా వారు చేసిన మంచి పనులు ప్రజల గుండెల్లో చిరకాలం గుర్తిండిపోతాయి. అలాంటి కోవలోకే వస్తారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయన ఐదేళ్ల పాలనలో డోన్ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషి చేసి చెరగని ముద్ర వేశారు. ఆరోగ్యశ్రీ, 108 వాహనాలు, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. 2004లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఐదేళ్ల కాలంలో నియోజకవర్గానికి 5వేల ప్రభుత్వ పక్కా గృహాలను మంజూరు చేయించారు. ఇందులో ఒక్క డోన్ పట్టణానికే 3 వేల గృహాలను కేటాయించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ నగర్, సుజాతమ్మ, సర్వోత్తమరెడ్డి, ఆర్యవైశ్య నగర్, ఆటోనగర్ పేర్లతో పలు కాలనీల్లో పక్కాగృహాలు నిర్మించడంతో డోన్ అభివృద్ధి రెండింతలైందని చెప్పవచ్చు. దీంతో పాటు ఏపీ మోడల్ స్కూల్, ఏపీ రెసిడెన్షియల్, కస్తూర్బా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించారు. మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి పేరుపై అవుట్‌డోర్ స్టేడియం నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేశారు. చుక్క సాగునీటి వసతి లేని ఫ్యాక్షన్ మండలమైన క్రిష్ణగిరి మండలం మీదుగా హంద్రీ-నీవా కాల్వను తీసుకొచ్చి ఒకప్పుడు డోన్ నియోజకవర్గంలో అంతర్భాగమైన క్రిష్ణగిరి మండలాన్ని పాడి పంటలతో సస్యశ్యామలం చేశారు. దీంతో ఫ్యాక్షన్ పూర్తిగా రూపుమాపగలిగారు. ఆయన రెండోసారి సీఎం అయిన తర్వాత కొద్ది నెలలకే అకాల మృతితో నియోజకవర్గ ప్రజలు తల్లడిల్లిపోయారు. 2019 ఎన్నికల్లో ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రూ.3,500 కోట్లను కేటాయించారు. ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గాన్ని సాగు, తాగు, విద్య, వైద్య, టూరిజం, పారిశ్రామిక, ఉపాధి రంగాలతో పాటు అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దారు. సెప్టెంబర్ 2వ తేదీ మహానేతను స్మరించుకోవడంలో నియోజకవర్గ ప్రజలు అగ్రభాగాన నిలుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు.

చిత్రకారుని నివాళి

మహానేతను స్మరించుకుంటూ పట్టణానికి చెందిన ఆర్టిస్ట్ హరి వైఎస్సార్ చిత్రాన్ని నవధాన్యాలు, కూరగాయలతో అద్భుతంగా చిత్రీకరించారు. ఈ చిత్రం మహానేతను సజీవంగా చూసినట్లు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది. తనకు వైఎస్సార్ అంటే ఎంతో ఇష్టమని ఆర్టిస్ట్ హరి చెప్పుకొచ్చారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి సోమవారం నుంచి పగటి పూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

డోన్ టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చాంద్‌బాషా హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో పాటు తోటి సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

హిందూ ధర్మం పాటిస్తే జీవితానికి సార్థకత



సమావేశంలో మాట్లాడుతున్న అనంత విశ్వ ప్రసాద్, సమావేశానికి హాజరైన సభ్యులు

డోన్ టౌన్: హిందూవుగా పుట్టిన ప్రతి ఒక్కరు హిందూ ధర్మాన్ని ఆచరించినప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుందని విశ్వ హిందూ పరిషత్ ధర్మ ప్రచారక్ అనంత విశ్వ ప్రసాద్, ప్రముఖ శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. వీహెచ్‌పీఎస్ 60వ వార్షికోత్సవం పురస్కరించుకుని డోన్ ప్రఖండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షష్ఠి కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రపంచ దేశాల్లో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు హిందూ తత్వానికి ప్రతీకగా నిలిచాయన్నారు. మహా భారతం, రామాయణం వంటి ఎన్నో పురాణాలు హిందూతత్వం పరమార్థం వివరించాయని తెలిపారు. పిల్లలకు హిందూ ధర్మం గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, కిషోర్, డోన్ కార్యదర్శి శివపురం రామరాజేష్, రామకృష్ణ, ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, శివశంకర్‌రెడ్డి, బజరంగ్‌దళ్ నాయకులు తిరుపాల్, దుర్గాభవాని, శ్రీరాములు, కృష్ణారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం


పేరుసోముల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంజామల: మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పేరుసోముల త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు సురేష్ అధ్వర్యంలో ఏడు రోజుల పాటు శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారికి కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు గ్రామంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, గొల్ల వీధి, మెయిన్ బజార్, తగ్గు బజార్ తదితర ప్రాంతాల మీదుగా స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, దస్తేశ్వర్ రెడ్డి, మల్లేష్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆగస్టు 26వ తేదీ కృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలోని చిన్నకట్ట వద్ద త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీకృష్ణున్ని కొలువుంచారు. సోమవారం వేడుకల ముగింపును పరస్కరించుకుని స్వామివారి ప్రతిమను గ్రామ ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామకృష్ణ, విశ్వనాథ్, పుల్లయ్య, జమాల్ బాషా, తిరుపాల్ నాయుడు, రమేష్, జయన్న తదితరులు పాల్గొన్నారు.


ప్యాపిలిలో గ్రామోత్సవం

సమాజంలో లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శం


మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ

బేతంచెర్ల: సమాజంలో లయన్స్ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని సీఐ డి. వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విజయవాడకు చెందిన స్వర సూపర్‌స్పెషాలిటీ వైద్యులు గుండె సంబంధ వైద్యపరీక్షలు నిర్వహించారు. 140 మందికి ఈసీజీ పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు, సభ్యులు మురళీకృష్ణ, సాంబ శివారెడ్డి, ధనుంజయ, ప్రవీన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం


నిర్మాణం పూర్తయిన ఫంక్షన్ హాల్

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో మండల ప్రజల సౌకర్యార్థం రామ్‌కో సిమెంట్ కంపెనీ సుమారు రూ.3 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తున్న ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. స్థానికంగా సరైన కల్యాణ మండపం లేకపోవడంతో మండల ప్రజలు తాడిపత్రి, కోవెలకుంట్ల, బనగానపల్లె, జమ్మలమడుగు తదితర పట్టణాలకు వెళుతుండేవారు. వీటిని దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టాలని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. కస్తూర్బా పాఠశాల వద్ద 1.20 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని మంజూరు చేయించడంతో కంపెనీ ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు ముందుకొచ్చింది. ప్రస్తుతం నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. విశాలమైన మండపం, డైనింగ్ హాల్, గదులు, టాయ్‌లెట్లు, నీటి సౌకర్యంతో పాటు విశాలమైన పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఫంక్షన్ హాల్ ప్రారంభమైతే మండల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

మిరపలో యాజమాన్య పద్ధతులు


మిరప చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలతో కోవెలకుంట్ల సబ్ డివిజన్ పరిధిలో సాగైన మిరపలో వర్షపునీరు నిల్వ చేరిందని, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని ఉద్యానవనశాఖ అధికారిణి ధరణి సూచించారు. వర్షపునీరు నిల్వ చేరిన మిరప పంటను ఆదివారం ఉద్యానవనశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిరపలో అధికంగా నీరు చేరిన పొలాల్లో లీటరు నీటికి 3 గ్రాముల 19:19:19, ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారి చేయాలన్నారు. నారు, మొదలు కుళ్లు తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్, రెండు గ్రాముల మాంకోజెబ్ కలిపి మొదలు తడిచేలా పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పంటలో అధికనీరు నిల్వ ఉండకుండా తీసి వేయాలన్నారు. అధిక తేమ శాతం కారణంగా ఉల్లిపైరుకు కుళ్లు తెగులు సోకే అస్కారం ఉందన్నారు. నివారణకు ఎకరాకు ఒక కిలో చొప్పున కార్బండిజమ్, మాంకోజెబ్‌ను ఇసుకలో కలిపి భూమిలో చల్లుకోవాలని సూచించారు. అధిక వర్షాల వల్ల టమాట పంటకు కుళ్లు, బ్యాక్టీరియల్, ఫంగల్ తెగుళ్లు సోకే అవకాశం ఉందన్నారు. నివారణకు లీటరు నీటికి 5 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి, లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను వేళ్ల కాడ బాగా తడిచేలా పిచికారీ చేయాలని తెలిపారు.

నేడు గాడుబావిలో అమావాస్య పూజలు

బేతంచెర్ల: పట్టణంలోని గాడుబావి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఉదయం ఆంజనేయస్వామికి అభిషేకం, సింధూరార్చన, భక్తులకు ప్రసాద వితరణ, సాయంత్రం 6:30 గంటలకు స్వామి వారికి పల్లకీ సేవ, హనుమాన్ చాలిసా పారాయణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి


సీపీఐ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రైతాంగ డిమాండ్ డే సందర్భంగా సీపీఐ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కౌలు రైతులకు నష్ట పరిహారం, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సీపీఐ నాయకులు సంజీవులు, ఏఐటీయూసీ, ప్రజానాట్య మండలి నాయకులు బాలకృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.